# ఆనందో



# బ్రహ్మ

## నెలనెలా నవ్వుల విందు

- సాయి బ్రహ్మానందం గొర్తి

## ఇంతకీ ?

సత్యమంగళం అడవిలో వీరప్పన్ లాంటి మరో నరహంతకుడు బయల్దేరాడు. ప్రజల్ని దోచుకుంటూ, కనిపించిన వారిని నరుకుతూ, నానా భీభత్సం చేస్తూ, ఏలిన వారికి తలనొప్పిలా తయారయ్యాడు. ఆ నరహంతకుణ్ణి పట్టి ఇచ్చిన వారికి కోటి రూపాయిలు ఇస్తామని ప్రకటించినా ఎవరూ ముందుకు రాలేదు. బహుమతి పెంచింది ప్రభుత్వం. ఓ ముగ్గురు వ్యక్తులు ‘మేం ప్రయత్నిస్తాం‘ అంటూ ముందుకొచ్చారు. ముగ్గుర్నీ ఒకేసారి పంపడం ఇష్టం లేక, నిజంగా ఆ ముగ్గురికీ పట్టుకునే చిత్తశుద్ధి ఉందా, లేదా అని సదరు రక్షణాధికారులు విచారించడం మొదలు పెట్టారు. మొదటి వ్యక్తిని కలసి, “మీరు నరహంతకుడ్ని పట్టుకుంటే మీకు ఎంత బహుమతి కావాలి? దాన్ని మీరేం చేస్తారు?“ అని అడిగారు. దానికా మొదటి

వ్యక్తి, “ నాకు పదికోట్లు కావాలి. దాంతో మా ఊళ్ళో ఓ ఇంజనీరింగ్ కళాశాల కట్టిస్తాను“ అంటూ చెప్పాడు. రెండో వ్యక్తినీ ఇదే ప్రశ్నించారు. అతను, “నాకు ఇరవై కోట్లు కావాలి. అందులో సగం నా బీద కుటుంబానికి ఇస్తాను. మిగతా సగం ఉపయోగించి, మా ఊళ్ళో ఆసుపత్రి సౌకర్యం లేదు కనుక అది కట్టిస్తాను“ అని జవాబిచ్చాడు. ఇహ మూడో వ్యక్తి వంతు వచ్చింది. అతను ఇంతకు ముందు వాళ్ళని అడిగిన ప్రశ్న దొంగచాటుగా

తెలుసుకున్నాడు. అధికారులు అతన్ని ప్రశ్న అడగకుండానే "నాకు ఓ ముప్ఫై కోట్లు ఇవ్వండి" అని వాళ్ళ చెవిలో మెల్లగా ఊదాడు. "ముప్ఫై కోట్లా ?" అంటూ వాళ్ళు మొహాలు వెళ్ళ బెట్టి, "దాంతో ఏం చేస్తావు?" అని తేరుకొని అడిగారు.

"చాలా సింపుల్ ! ఆ ముప్ఫై కోట్లలో రెండు కోట్లు మీ అధికారుల కిస్తాను. పద్దెనిమిది కోట్లు నేనుంచుకుని, మిగిలిన పదికోట్లతో మొదటి వ్యక్తిని అడవికి పంపుతాను." అంటూ తన ప్లాన్ చెప్పాడు.

"ఇంతకీ మీరేం చేస్తారు? "

"నేనా రాజకీయ నాయకుణ్ణి..."

అధికారులకి నోట మాట లేదు.

## స్ఫూర్తి



"మీ పర్సులో దేముడి ఫొటో పెట్టుకోరు కానీ ఎప్పుడూ నా ఫొటో పెట్టుకుంటారెందుకని?" అమాయకంగా అడిగింది సుందరి

"అవును.. నాకు ఏ కష్టమొచ్చినా నీ ఫొటో చూస్తే చాలు, నా ముందున్న సమస్యలన్నీ క్షణంలో అధిగమిస్తాను.. అందుకే పర్సులో నీ ఫొటొ లేకుండా బయటకు కాలు పెట్టను. " సుబ్బారావు చెప్పాడు.

"చూసారా? నేను మీ వెనకాలే ఉంటూ పరోక్షంగా మీకు ఎంత స్ఫూర్తి నిస్తున్నానో!" సుందరి కించిత్ గర్వ పడింది.

"అవును. ఏ సమస్య వచ్చినా నీ ఫొటో కేసి చూస్తూ, 'ఈ ప్రపంచంలో దీనికంటే మించిన పెద్ద సమస్య ఉంటుందా?' అని ఒక్కసారి అనుకుంటాను. అంతే నా ముందున్న సమస్యలన్నీ చిటికలో మాయమవుతాయి.." నవ్వుతూ చెప్పాడు. సుబ్బారావు.

## శుభవార్త...



వెంకటేశం, పార్వతీశం క్రికెట్ పిచ్చాళ్ళు. ప్రతీ మ్యాచ్‌కీ ఇద్దరూ కలిసే వెళ్ళే వాళ్ళు. వీలున్నప్పుడల్లా క్రికట్ ఆడేవాళ్ళు. హఠాత్తుగా పార్వతీశానికి గుండె జబ్బొచ్చి పోయాడు. వెంకటేశం బెంగ పడ్డాడు. ఓ రోజు పార్వతీశం వెంకటేశం ముందు ప్రత్యక్షమయ్యాడు

“వెంకటేశం! నేనురా. పార్వతీశాన్ని.. బాగున్నావా? “

వెంకటేశం నమ్మలేకపోయాడు.

“నువ్వా పార్వతీశం! ఎన్నాళ్ళయ్యింది చూసి? “

“అవును.. నా గురించి బెంగ పడి క్రికెట్ మాచ్ కూడా చూడడం లేదని తెలుసుకొని పై లోకాలనుండి వచ్చాను...“

“నా గురించి పై లోకాలనుండి వచ్చావా? అక్కడ క్రికెట్ ఉందా?“

“ఒక్క వండే మ్యాచ్‌లే కాదు, టెస్ట్ మ్యాచ్‌లూ, ట్వంటీ ట్వంటీ మ్యాచ్ లూ జరుగుతాయి. నీకో విషయం తెలుసా? ఇక్కడ ప్రతీ ఏడూ వరల్డ్ కప్ జరుగుతుంది. ఇండియాలో అయితే జట్టులో స్థానం దొరకాలంటే అడ్డమైన గడప తొక్కాలి. ఇక్కడ ఆ అవసరం లేదు. ప్రతిభ ఉంటే చాలు ఎవరికైనా చోటు దొరుకుతుంది. నీకో రెండు శుభవార్తలు చెబుదామనే వచ్చాను. రేపటి నుండి ఇక్కడ జరగ బోయే వరల్డ్ కప్ మాచ్ లో నేను ఓపెనర్ గా బ్యాటింగ్ చేస్తున్నాను...ఇన్నాళ్ళ నా కల ఫలించింది.. ఇండియాలో ఒక్క మ్యాచ్ ఆడకుండా పోయాను అని దిగులు పడేవాణ్ణి... ఇదే మొదటి శుభవార్త! ..“

వెంకటేశం ఆశ్చర్యపోయాడు. “అలాగా! మరి రెండోది?“

“రేపు మాచ్‌లో నువ్వే ఓపెనింగ్ బౌవులరివి...!“

వెంకటేశం కళ్ళు తేలేసాడు.

## హెల్పు ...



తిక్క శంకరం : డాక్టర్ గారూ! నాకు ఈ మధ్య పని ఒత్తిడి వల్ల చికాకు, కోపం విపరీతంగా పెరిగాయి. దాని వల్ల ఇబ్బందిగా ఉంది...

దయచేసి నాకు హెల్పు చెయ్యండి.

డాక్టర్ : అలాగా! ఇలా వచ్చి కూర్చోండి. ఇప్పుడు వివరంగా చెప్పండి మీ ప్రోబ్లం ఏమిటో?

తిక్క శంకరం : ఓరి బడుధ్ధాయీ! ఇప్పుడే చెప్పాను కదురా? మళ్ళా మళ్ళా అడుగుతావా? నీకు బుధ్ధుందా?

ఒక్కసారి కంగు తిన్నాడు డాక్టర్!

## యువరానర్ !



లాయర్: యువరానర్! మా ముద్దాయి.. అసలు ఈ దొంగతనం చేయలేదని మనవి చేసుకుంటున్నాను. ప్రాసిక్యూషన్ వారి అభియోగం ప్రకారం, శీను అనబడే ఈ ముద్దాయి, బాంకులో ప్రవేశించిన మాట నిజమే! కానీ ఆ లాకర్ ఓపెన్ చేసింది అతను కాదు అతని చెయ్యి.. అతని చెయ్యి అతని మనస్సు మాట వినదు. ఓ చెయ్యి చేసిన నేరానికి శరీరంలో ఉన్న మిగతా అవయవాలన్నిటినీ శిక్షించడం భావ్యం కాదు. అతని కన్ను ఈ నేరం చేయ లేదు. అతని చెవి ఈ నేరం చేయ లేదు. కాబట్టి, మిలార్డ్..మీరు కావాలంటే నా ముద్దాయి చేతిని శిక్షించండి.. కానీ అమాయకుడైన ఇతన్ని విడిచిపెట్టమని కోర్ట్ వారిని మనవి చేసుకుంటున్నాను.

జడ్జి : మీ వాదన విన్న తరువాత మీరు చెప్పింది నిజమే అనిపిస్తోంది. మీరు చెప్పినట్లుగానే అతని చేయినే శిక్షిద్దాం! అతని చేయి శరీరంతో కలిపి ఉంచుకుంటారో లేక విడిగా నరికి జైలులో ఉంచుతారో మాకు తెలియదు. అతని చెయ్యికి పాతికేళ్ళు జైలు శిక్ష విధిస్తున్నాను..

అంతే, ఒక్క క్షణం అలస్యం చేయకుండా సదరు ముద్దాయి తనకున్న అర్టిఫిషియల్ చేతిని తీసి జడ్జి గారి ముందుంచాడు.

# యమకీయం



ఓ రాజకీయ నాయకుడు బాల్చీ తన్ని యమ లోకంలో పడ్డాడు. అతన్ని. యమధర్మరాజు ముందుంచారు

"ప్రభూ! ఇతను ఓ రాజకీయ నాయకుడు. పొట్టకోస్తే అక్షరమ్ముక్క లేదు. హత్యలూ, మాన భంగాలూ లంచాలూ ఇతను చేసినవి. ప్రజల సొమ్ము ఎడాపెడా వాడుకున్నాడు. ఎంతటి వాళ్ళ నయినా ఇట్టే బుట్టలో వేసేస్తాడు. మాటల మరాఠీ! ఇతడెంత నీచుడంటే, సునామీలూ, బాంబులు పేలి జనం చచ్చిపోతే ప్రభుత్వం వారి వారి కుటుంబాలి కివ్వాల్సిన సహాయ నిధి కూడా మింగేశాడు."

యథా ప్రకారం చిత్రగుప్తుడు చిట్టా విప్పాడు.

యమ: ఈ చిత్రగుప్తుడు చెప్పినవన్నీ చేసావా?

రాజకీయ నాయకుడు: యమధర్మరాజా! క్షమించాలి. సునామీలూ, వరదలూ వచ్చినప్పుడు ప్రభుత్వం సహాయం ప్రకటించిన మాట వాస్తవమే! సునామీ బాధితులకి వంద కోట్లు, వరద బాధితులకి రెండు వందల కోట్లు, బాంబు పేలుళ్ళ బాధితులకి ఇంకో వంద కో ట్ల సహాయం ప్రకటించింది. కానీ ప్రజలకిస్తానని అనలేదు కదా న్యాయం ప్రకారం నేను వాళ్ళ సొమ్ము తిన లేదు. ప్రజా సేవ నిమిత్తమై ప్రభుత్వం దగ్గర డబ్బు తీసుకున్నాను అంతే! ప్రకటించడం, ఇస్తానని వాగ్దానం చేయడం ఒకటి కాదు కదా?

వాడి తెలివికి మతి పోయింది యముడికి .

యమ: అవును నువ్వు చెప్పిన దాంట్లో నిజముంది. కానీ ఇలా చిన్నా చితకా నేరాలు చేసిన ఎవరికైనా ఓ రోజు నరకం లోనూ, మిగతా కాలమంతా స్వర్గంలో గడిపేలా తీర్పు అని ప్రకటిస్తున్నాను....

రాజకీయ నాయకుడు యముణ్ణి కూడా బోల్తా కొట్టించానని సంబర పడ్డాడు. యమ భటులు వచ్చి, ముందుగా ఓ గంట సేపు స్వర్గానికి తీసుకెళ్ళి, ఇహ పెర్మనెంటుగా నరకంలో పడేస్తున్నామని చెప్పారు. ఇది విని రాజకీయ నాయకుడు కంగు తిన్నాడు.

"యమ ధర్మ రాజా ! ఇది అన్యాయం ! నాకు ఓ రోజు నరకం, మిగతా కాలమంతా స్వర్గం అని "ప్రకటించి ఇలా మోసం చేస్తారా?" అంటూ యమలోకం దద్దరిల్లేలా అరిచాడు. ప్రత్యక్షమయ్యాడు యమలోకాధిపతి.

"ప్రకటించడం వేరు, శిక్ష వేరు నాయనా!" అంటూ యమ రాజకీయపాఠం చెప్పాడు యముడు.

ర్చ !

